నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | ఆదివారం 11 ఆగస్టు 2024 | MAHABUBABAD

## దోమల బెడద ఎక్కువుంది



డోర్నకల్ : హాస్టల్‌లో దోమల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో విపరీతంగా కుడుతున్నాయి. వీటి నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలి. అలాగే కోతులు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోతుల బెడద లేకుండా చూడాలి. విద్యార్థులకు వడ్డించే అటుకులు మంచిగా లేవు.

– ఎడ్ల రేవతి, 9వ తరగతి విద్యార్థిని, కేజీబీవీ రాజుతండా, డోర్నకల్




గుమ్మడూరులోని ఎంజేపీ గురుకులం

## బెంచీలు లేక ఇబ్బందులు



డోర్నకల్ : తరగతి గదిలో బెంచీలు లేక ఇబ్బంది పడుతున్నాం. అలాగే దోమలు ఎక్కువగా ఉన్నాయి. వీటి నివారణకు మందు స్ప్రే చేయాలి. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలి.

– ఏ దీపిక, కేజీబీవీ రాజుతండా, డోర్నకల్



జనగామలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో డోర్లు లేని మరుగుదొడ్లు



వరంగల్ ఉర్సుగుట్ట వద్ద డ్రైనేజీ ఆనుకుని అద్దె భవనంలో ఉన్న ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాల

ఫీల్డ్ విజిట్

# గురుకులం.. అస్తవ్యస్తం

## సమస్యలతో విద్యార్థుల సహవాసం

**అరకొర వసతులు, అధ్వానంగా పరిసరాలు**

**పెచ్చులూడుతున్న తరగతి గదులు, ఉరుస్తున్న భవనాలు**

**విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేని మరుగుదొడ్లు, స్నానగదులు**


- డ్యుయల్ డెస్కులు లేక నేలపైనే చదువులు
- పలుచోట్ల అద్దె భవనాల్లో అవస్థలు
- రెంటికీ ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి
- తప్పని విష పురుగుల బెడద
- పర్యవేక్షణ లేక పక్కదారి పడుతున్న మెనూ
- 'నమస్తే' క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగులోకి..

**అరకొర వసతులు, సవాలక్ష సమస్యలతో అస్తవ్యస్తంగా ప్రభుత్వ గురుకులాలు మారాయి. సరిపడా గదులు లేక కొన్ని, ఉన్నా శిథిలమై పెచ్చులూడే తరగతులు, ఉరుస్తున్న భవనాల భయంభయంగా విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక చాలాచోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానగదులు లేవు, వాటికి తలుపులు కూడా మల విసర్జనకూ బాటిళ్లు తీసుకొని ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఈ క్రమంలో పాములు, తేళ్లు వంటి విషపురుగులూ కుట్టిన సందర్భాలూ లేకపోలేదు. ఇక వరంగల్ ఉర్సుగుట్టలోని ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాల చదువుల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిస్తే.. సమస్యల్లో మాత్రం వెనుకే ఉండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల డ్యుయల్ డెస్కులు లేక నేలపైనే చదువులు, అద్దె గదుల్లో విద్యార్థులు అవస్థలు, అతీగతీ లేని వసతులు, పర్యవేక్షణ కరువైన విద్యార్థులు పక్కదారి పడుతున్న విషయాలు శనివారం 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్‌లో వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా పలు గురుకులాల పరిస్థితిపై ప్రత్యేక కథనం.**

– వరంగల్, మహబూబాబాద్, ములుగు, ఆగస్టు 10 (నమస్తేతెలంగాణ)/ హనుమకొండ /నర్సంపేట/వర్ధన్నపేట/జనగామ చౌరస్తా

## సమస్యలతో ఉర్సుగుట్ట గురుకులం సతమతం

వరంగల్ ఉర్సుగుట్టలోని అద్దె భవనంలో నడుస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సమస్యలు గూడుకట్టుకున్నాయి. సరిపడా గదులు, టాయిలెట్స్, డ్యూయల్ డెస్కులు లేవు. ఈ పాఠశాల, కళాశాల గత విద్యాసంవత్సరంలో రాష్ట్రస్థాయిలోనే ప్రథమస్థానంలో నిలిచినప్పటికీ సమస్యలతో సమతమవుతున్నది. శనివారం 'నమస్తే తెలంగాణ' ఈ గురుకులాన్ని విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ భవనం ఖమ్మం బైపాస్‌రోడ్డు పక్కన డ్రైనేజీని ఆనుకుని ఉండడంతో దుర్వాసన వస్తుండగా, కొన్ని సందర్భాల్లో విద్యార్థినులు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఈ గురుకులంలో ఐదు నుంచి పదో తరగతి విద్యార్థినులు 480, ఇంటర్మీడియట్ చదువుతున్న వారు 320, మొత్తం 800 మంది ఉన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులు 160 మందే ఉండాల్సి ఉండగా, జిల్లాలోని నెక్కొండ మహాత్మా జ్యోతిబాపూలే కళాశాల నిర్వహణకు అవసరమైన వసతులు లేకపోవటం వల్ల అక్కడి నుంచి 160 మందిని ఇక్కడకు తీసుకొచ్చారు. ఈ గురుకులంలోని పాఠశాల విద్యార్థినులు తరగతి గదుల్లో నేలపై కూర్చోవాల్సి వస్తున్నది. పాఠశాల విద్యార్థినులకు చెందిన డ్యుయల్ డెస్కులను నెక్కొండ నుంచి వచ్చిన ఇంటర్మీడియట్ విద్యార్థినులకు సమకూర్చటం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైంది. మూడు తరగతుల విద్యార్థినులు నేలపై కూర్చొని చదువు సాగిస్తున్నారు.



జక్కలొద్దిలోని గురుకులంలో స్టాఫ్ క్వార్టర్ల ముందు పెరిగిన పచ్చగడ్డి

**రహదారి ఇక్కట్లు**

వరంగల్ జక్కలొద్ది వద్ద సొంత భవనంలో పనిచేస్తున్న ప్రభుత్వ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలకు రహదారి సమస్య ఉంది. వరంగల్‌ను ఆనుకుని ఉన్న జక్కలొద్ది గ్రామం వరకు బీటీ, సీసీ రోడ్డు ఉండగా, పాఠశాల వరకు కేవలం మట్టి రోడ్డు మాత్రమే ఉంది. వర్షం పడితే ఈ రహదారి పూర్తిగా బురదమయం అవుతోంది. దీంతో విద్యార్థులు, వారి పేరెంట్స్‌తో పాటు ఉపాధ్యాయులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత రోడ్డు నిర్మాణం కోసం ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలు ఆచరణలోకి రాలేదు. ఓ జనరేటర్ ఉన్నా రాత్రి వేళ కొన్ని సందర్భాల్లో కరెంటు కొరత ఏర్పడుతోంది. టీచర్ల కోసం నిర్మించిన క్వార్టర్లను అంతగా ఉపయోగించకపోవడంతో వాటి ముందు పచ్చగడ్డి పెరిగింది.




అధ్వానంగా ఉన్న జక్కలొద్దిలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలకు చేరుకునే మట్టిరోడ్డు



మల్లంపల్లి గురుకులంలో జ్వరంతో పడుకున్న విద్యార్థులు

## జ్వరం.. భయం భయం..

ములుగు జిల్లాలోని గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌పై పర్యవేక్షణ లోపించడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో పాములు, తేళ్లు లాంటి విషపూరిత పురుగుల కాటుకు విద్యార్థులు గురవుతున్నారు. దీంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో రాత్రి వేళ సరిగా నిద్రపోవడం లేదు. ములుగు మండలం మల్లంపల్లిలోని అద్దె భవనంలో కొనసాగుతున్న ఏటూరునాగారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 450 మంది విద్యార్థులు ఉంటుండగా, గదుల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. తరగతి గదుల్లో డ్యూయల్ డెస్కులు లేక ఐదు నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు కింద కూర్చొనే విద్యనభ్యసిస్తున్నారు. బెడ్‌లు లేక చాపల పైనే నిద్రిస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా డ్యుయల్ డెస్కులు, బెడ్స్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. ఇదిలా ఉండగా జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో సైతం పరిశుభ్రత లోపించింది. పిచ్చిమొక్కల నడుమే మరుగుదొడ్లు ఉన్నాయి.



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

## పారిశుధ్యం అధ్వానం



అపరిశుభ్రంగా ఉన్న వాష్ ఏరియా

హనుమకొండ జిల్లాలో గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు మురికి కూపాలుగా మారాయి. వాటిలో విద్యార్థులు పలు రకాల సమస్యలతో సహవాసం చేస్తున్నారు. చాలా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించడం లేదు. గత ప్రభుత్వం గురుకులాలు, ఆశ్రమ పాఠశాలు, హాస్టళ్లకు సన్నబియ్యంతోపాటు బలవర్ధకమైన పౌష్టికాహారం సరఫరా చేసింది. ప్రతి రోజూ కోడి గుడ్లు, వారంలో రెండు రోజులు చికెన్, చేపలు భోజనం పెట్టేవారు. ప్రస్తుతం వారంలో రెండు రోజులు మాత్రమే కోడిగుడ్లు పెడుతున్నట్లు సమాచారం. కొన్ని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో దొడ్డు బియ్యం అన్నం, కుళ్లిపోయిన కూరగాయలు, ఉల్లిగడ్డలు, నీళ్ల చారుతో భోజనం పెడుతున్నట్లు కొందరు విద్యార్థులు తెలిపారు. అంతేకాక కిటికీలకు, రూమ్‌లకు మెష్(దోమ తెరలు)లు ఏర్పాటు చేయకపోవడం, ఫ్యాన్లు సరిగ్గా తిరగకపోవడంతో దోమలు, ఈగలతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. బాలసముద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో అనేక సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఉన్న కొన్ని గదులనే అన్నింటికీ వాడుతున్నారు. విద్యాబోధన చేయడంతోపాటు విద్యార్థులు ఆ గదుల్లోనే పడుకుంటున్నారు. విద్యార్థులు కూర్చునేందుకు కుర్చీలు, పడుకొనేందుకు గార్మెంట్స్ లేక నేలపైనే కూర్చోబెట్టి క్లాసులు చెప్పడం, రాత్రి వేళల్లో అదే నేలపైనే పడుకోబెట్టడడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కెపాసిటీకి మించి విద్యార్థులు చేరుతుండడంతోనే ఇబ్బందులు వస్తున్నాయని పలువురు వార్డెన్లు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి బియ్యం, పప్పులు సరఫరా చేస్తున్నప్పటికీ కోడి గుడ్లు, పాలు, కూరగాయల లాంటి ప్రొవిజన్స్‌కు గత ఫిబ్రవరి నెల నుంచి బిల్లులు రావడం లేదని, అప్పులు తెచ్చి సొంతగా కొనుగోలు చేస్తున్నట్లు వార్డెన్లు చెబుతున్నారు.



జనగామలోని ఎంజేపీ గురుకులంలో నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థులు

## నేలపైనే తరగతులు

జనగామ జిల్లాలోని పలు సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో సమస్యలు తిష్టవేశాయి. కొన్ని గురుకులాల్లో తరగతి గదుల పైకప్పు పెచ్చులు ఊడిపోతున్నాయి. బెంచీలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు. డార్మెట్రీలో బెడ్స్ కూడా లేక నేలపైనే పడుకోవాల్సి వస్తోంది. బాత్రూంలు, మరుగుదొడ్లకు నీరు సరఫరా అయ్యే కుళాయిలు విరిగిపోయాయి. మరికొన్ని గురుకులాల్లో మరుగుదొడ్లకు తలుపులు లేవు. విద్యార్థులు ఆరుబయట మల విసర్జన కోసం వాటర్ బాటిల్స్ తీసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సరిపడా తరగతి గదులు, డార్మెట్రీలు లేక సమీపంలోని మరో గురుకులానికి విద్యార్థులను బదలాయిస్తున్నారు. కొన్ని గురుకులాల్లోని తరగతి గదుల్లో పాఠాలు బోధించేందుకు అవసరమైన నల్లబల్లలు కూడా సరిగా లేవు. జిల్లాకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ తరగతి గదుల పైకప్పు పెచ్చులూడుతున్నాయి. ఇది ఈ నెల 5న రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలగు వర్షిణి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కలిసి పాఠశాలను సందర్శించిన సమయంలో బయట పడగా వారు అక్కడి పరిస్థితి చూసి విస్మయం చెందారు. అలాగే బాత్రుం, మరుగుదొడ్ల దుస్థితిని చూసి అధికారులు సైతం నివ్వెరపోయారు.

## 613 మందికి.. 22 టాయిలెట్స్

మహబూబాబాద్ జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో వసతులు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ పట్టణం గుమ్మడూరులోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను శనివారం 'నమస్తే తెలంగాణ' బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఇందులో ఐదు నుంచి పదో తరగతి, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విద్యార్థులు చదువుతున్నారు. దంతాలపల్లిలో అద్దె భవనం దొరకకపోవడంతో అక్కడి విద్యార్థులను కూడా ఇక్కడికే తీసుకొచ్చారు. మొత్తం 613 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తరగతి గదులు సరిపడా ఉన్నప్పటికీ టాయిలెట్స్ కేవలం 22 మాత్రమే ఉండడంతో ఉదయం లేవగానే క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. బాత్రూంలు కూడా తక్కువగానే ఉన్నాయి. భోజనశాల సైతం చిన్నగా ఉండడంతో మూడు షిఫ్టుల్లో భోజనాలు చేస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ దేవులపల్లి రాజేశ్‌ను వివరణ కోరగా తాను ఇటీవలే బదిలీపై వచ్చానని, సమస్యలను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానన్నారు.



## ఇల్లంద కేజీబీవీపై నిండా నిర్లక్ష్యం

**కలెక్టర్ హామీ ఇచ్చినా ఫలితం సున్నా..**



పాఠశాల ఆవరణలో మొరం పోయించి వదిలేసి అధికారులు

వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమస్యలకు నెలవుగా మారింది. పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసింది. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సరైన నిర్వహణ లేక వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. ఫలితంగా విద్యార్థినులు నల్లా నీళ్లు తాగాల్సి వస్తోంది. కులుషిత నీటి వల్ల విద్యార్థులు పలుమార్లు జ్వరాల బారిన పడుతున్నారు. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా అపరిశుభ్రంగానే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంలో కూడా అధికారులు నిర్లక్ష్యం కనిపిస్తోంది. అలాగే శుచి, రుచికరమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. ప్రస్తుతం ఇల్లంద కేజీబీవీలో 170మంది పాఠశాలలో, 94 మంది ఇంటర్ విద్యనభ్యసిస్తున్నారు. అంతేగాక వర్షాలు కురిస్తే పాఠశాల మైదానమంతా చిత్తడిగా మారుతున్నది. ఇటీవల వరుసగా కురిసిన వానలకు పాఠశాల ఆవరణలోకి నీరు చేరి బురదమయమై విద్యార్థులు బయటకు వచ్చే వీలు లేకుండా ఉంది. అయితే కేవలం మొరం పోయించి చదును కూడా చేయించే మమ అనిపించేశారు. ఇటీవల కలెక్టర్ సత్యశారద కూడా పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఎలాంటి ఫలితం లేదు.

**ఉన్నతాధికారులకు నివేదించాం : ఎస్‌వో కరుణశ్రీ**

పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతు విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. అలాగే మిగిలిన సమస్యలను కూడా వివరించాం. త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. చదువులు, ఆటల్లో బాలికలు బాగా రాణిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థినులకు మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నాం.



నర్సంపేటలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తడిసిన గోడలు


## ఊడుతున్న పెచ్చులు.. అరచేతిలో ప్రాణాలు

నర్సంపేటలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాల భవనం పెచ్చులూడుతుండడంతో విద్యార్థుల ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇందులో ప్రస్తుతం 546 మంది విద్యార్థులున్నారు. గురుకులం ప్రారంభంలో నిర్మించిన భవనాలే కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు కూడా గోడలు, జాయింట్ల నుంచి కారుతున్నది. దీని వల్ల వర్షం కురిసినప్పుడల్లా ఎప్పుడు పెచ్చూలూడి మీద పడతాయోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే గోడల వెంట నీళ్లు కారుతూ పగుళ్లు వచ్చాయి. మరమ్మతు కోసం చాలాసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా ఫలితం లేదు. నిధులు మంజూరు చేయకపోవడంతో పాత భవనంలోనే కాలం వెళ్లదీస్తున్నారు. మొత్తం 40 గదులు ఉండగా, విద్యార్థుల వసతి కోసం 18, తరగతి గదులకు 14, కార్యాలయానికి 8 చొప్పున వాడుకుంటున్నారు. 546 మంది విద్యార్థులకు 20 బాత్‌రూంలు మాత్రమే అందుబాటులో ఉండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురువుతున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో ఆరుబయటే చేయాల్సి వస్తోంది.

# ప్రాణాలంటే లెక్క లేదా?

- ఎంజీఎంహెచ్‌లో మౌలిక వసతుల ఊసే లేదు
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ధ్వజం
- ఆస్పత్రి గేటు ఎదుట ధర్నా

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 10: ప్రజల ప్రాణాలు పోతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేదా? అని, ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం దవాఖానలో మౌలిక వసతుల ఊసే ఎత్తడం లేదని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ధ్వజమెత్తారు. ఎంజీఎం ఆవరణలో శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కు తిన్న ఘటనపై నన్నపునేని ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఎంజీఎం గేటు ఎదుట బైటాయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ధర్నా నిర్వహించారు. శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటన మనస్సును కలచివేసిందని మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజీఎంలో మౌలిక వసతుల కల్పనకు బీఆర్ఎస్ సర్కారు పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వల్లే ఈ ఘటనకు కారకులైన వారికి పోలీసులు గుర్తించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు విధులకు హాజరు కాకున్నా పట్టించుకోవడం లేదని, కేఎంసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శస్త్ర చికిత్సలు నిలిపివేశారని విమర్శించారు. వరంగల్‌ను హెల్త్‌హబ్‌గా మార్చేందుకు బీఆర్ఎస్ సర్కార్ కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటుతోపాటు 24 అంతస్తులతో దేశంలో ఎక్కడా లేనివిధంగా అత్యాధునిక సదుపాయాలతో నగరం నడిబొడ్డున హాస్పిటల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని గుర్తుచేశారు. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన హాస్పిటల్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. శిశువు మృతదేహం విషయంలో సూపరింటెండెంట్‌ను వెంటనే ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, నాయకులు మసూద్, బజ్జూరి వాసు, వేల్పుగొండ యాకయ్య, దాచేపల్లి సీతారాం, మేరుగు ప్రవీణ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



ఎంజీఎం ప్రధాన గేటు ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ నాయకులు

## పసికందు ఘటన కలచివేసింది

**మంత్రి కొండా సురేఖ**

ఖిలావరంగల్, ఆగస్టు 10: వరంగల్ ఎంజీఎం దవాఖాన ఆవరణలో పసికందు మృతదేహాన్ని వీధి కుక్కలు పీక్కుతిన్న ఘటన తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన దవాఖాన ఆవరణలో జరగడం బాధాకరమన్నారు. పసికందును కుక్కలు ఎక్కడి నుంచి తీసుకొచ్చాయో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్యులు అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఎంజీఎం దవాఖానలో అదనంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆమె ఆదేశించారు. దవాఖానలు, బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



వీధికుక్కలను బంధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

## ఎంజీఎంలో కుక్కల పట్టివేత

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 10: పసికందు ఘటన నేపథ్యంలో ఎంజీఎం దవాఖానలో సంచరిస్తున్న వీధికుక్కలను శనివారం మున్సిపల్ సిబ్బంది పట్టుకున్నారు. శిశువు మృతదేహాన్ని పీక్కుతిన్న ఘటన వెలుగులోకి రావడంతో శనివారం మంత్రి కొండా సురేఖ స్పందించి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జీడబ్ల్యూఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో 12 కుక్కలను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించారు.